సాక్షి కర్నూలు

శనివారం । 10 । ఆగస్టు । 2024



వీడిన హత్య కేసు మిస్టరీ

కర్నూలులో మూడు రోజుల క్రితం జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తేల్చారు. నిందితులను అరెస్ట్ చేశారు. 8లో▸



చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

చదువుతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. బి.క్యాంప్‌లోని బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632.73
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 104.704
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 45,086
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 31,831

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్‌గా నవ్య



కర్నూలు (అగ్రికల్చర్): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బి. నవ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జీఓ ఆర్‌టీ నం. 1391 విడుదల చేశారు. 2016 బ్యాచ్‌కు చెందిన నవ్య శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ పీఓగా పనిచేస్తున్నారు. ఈమె తన కుమారున్ని ట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించి అందరి ప్రశంసలు అందుకున్నారు. కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న నారపురెడ్డి మౌర్యను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

పోలీస్ పికెట్ లేని గ్రామంగా కప్పట్రాళ్ల

- ఎస్పీ బిందుమాధవ్



కప్పట్రాళ్ల గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: పోలీస్ పికెట్ కూడా అవసరం లేకుండా కప్పట్రాళ్ల మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుకు రావాలని ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన కప్పట్రాళ్లను శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామంలోని ఆంధ్రప్రగతి బ్యాంకు దగ్గర ప్రజలతో సమావేశమై మాట్లాడారు. భూ వివాదాలకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను ఎస్పీ స్వీకరించారు. ఎస్పీ వెంట పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజ యాదవ్, దేవనకొండ సీఐ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు నవాజ్



అథ్లెటిక్స్ పోటీల్లో బందే నవాజ్ (ఫైల్)

కర్నూలు (టౌన్): స్వీడన్ దేశంలోని గోథెన్స్‌బర్గ్‌లోవరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఆదోని పట్టణానికి చెందిన ఖాజా బందే నవాజ్ ఎంపికయ్యారు. ఈనెల 13 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో 60 సంవత్సరాల క్యాటగిరీలో ఈయన పాల్గొననున్నారు. వంద మీటర్ల హార్డిల్స్, 400 మీటర్లు, 4 ఇంటు 400 మీటర్ల రిలే పరుగులో తన ప్రతిభను చాటనున్నారు. భారత దేశం తరపున పోటీలకు ఎంపికైన ఖాజా బందే నవాజ్‌కు మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ టీజీ వెంకటేష్, అధ్యక్షులు పాండురంగారెడ్డి, కార్యదర్శి ఎర్రగుంట్ల రవికుమార్ అభినందనలు తెలిపారు.

మద్దికెరలో భారీ వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని 11 మండలాల్లో వర్షం కురిసింది. మద్దికెరలో అత్యధికంగా 52.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మంత్రాలయంలో 18.6, ఆలూరులో 10.4 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా సగటున 3.8 మి.మీ వర్షపాతం నమోదయింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా ఇప్పటివరకు 36.8 మి.మీ వర్షం కురిసింది. ఇంకా 68 శాతం లోటు వర్షపాతం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా

కర్నూలు(హాస్పిటల్): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై ప్రజలు మువ్వన్నెల జెండా ఎగురవేయాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి పీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అమరులైన వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు జాతీయ జెండాను చేతపట్టుకుని సెల్ఫీ దిగి www.harghartiranga.com వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపడం ఎలా సాధ్యం కాదో, అభిమానం గొంతుపై కత్తులు పెట్టినా రక్తం కళ్ల చూడగలరే కానీ.. ఆత్మీయ బంధువును దూరం చేయలేరు. ఒకరిని చంపి.. మరొకరిని కొట్టి.. ఇంకొకరిని బెదిరిస్తే ఆ పూట సంతోషపడొచ్చు.. ఇంకోరోజు నవ్వుకోవచ్చు.. కానీ గుండెల్లో కొలువైన నేత కనిపిస్తే చాలు జనసునామీ ఉరకలేస్తుంది. బిక్కుబిక్కుమంటూ మౌనంగా రోదించిన ఊరు ఊరే ఎదురేగి స్వాగతం పలుకుతుంది. ఆయన రాక ఓ భరోసా.. ఆయన మాట ఓ పోరాటం.. ఆయన అడుగులు నవ సంక్షేమానికి నాంది. బాధను మరిచి.. గాయాలను పక్కన పెట్టి.. ఉబికివచ్చే కన్నీళ్ల వెనుక ఆప్యాయత ఉప్పొంగింది. దారులన్నీ ఎదురుచూడగా.. మనసులన్నీ బారులుతీరగా.. మాజీ సీఎం వైఎస్ జగన్ రాక కొత్త ఉత్సాహాన్నిచ్చింది.

జననేతకు అడుగడుగునా నీరాజనం

- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చిన జనం
- టీడీపీ దమనకాండను ఎండగడుతూ సాగిన జననేత పర్యటన
- అధైర్య పడొద్దని, అండగా ఉంటామని బాధితులకు ధైర్యం
- సీతారామపురంలో పసుపులేటి సుబ్బరాయుడి కుటుంబాన్ని ఓదార్చిన వైఎస్ జగన్





మహానంది మండలం సీతారామాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్, (ఇన్‌సెట్) సుబ్బరాయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జగన్, చిత్రంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తదితరులు

కత్తులకు వెరవని అభిమానం.. వెనకడుగేయని బలగం

సాక్షి, నంద్యాల/పాణ్యం/ఓర్వకల్లు: టీడీపీ రాక్షస పాలనను ఎండగడుతూ.. ప్రజలకు అండగా నిలుస్తూ.. బాధితులకు భరోసానిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం మహానంది మండలం సీతారామాపురం గ్రామంలో పర్యటించారు. పోలీసుల సాక్షిగా ఈనెల 4వతేదీ అర్ధరాత్రి తెలుగుదేశం పార్టీ మూకల దాడిలో పసుపులేటి సుబ్బరాయుడు హత్యకు గురికాగా.. వారి కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదన్, రామసుబ్బారెడ్డి, ఇసాక్ బాషా, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, హఫీజ్‌ఖాన్, కంగాటి శ్రీదేవి, శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎస్వీ మోహన్ రెడ్డి, లబ్బీ వెంకటస్వామి, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎంపీలు పోచా బ్రహ్మానందరెడ్డి, బుట్టారేణుక, నాయకులు ఇంతియాజ్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

- టీడీపీ నాయకుల చేతిలో గాయపడిన గడివేముల మండలం ఒండుట్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు జి. రవీంద్రారెడ్డిని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎయిర్‌పోర్టు వద్ద పరామర్శించారు. ఎయిర్‌పోర్టు బయట అంబులెన్స్‌లో బెడ్‌పై ఉన్న రవీంద్రారెడ్డి వద్దకు చేరుకొని దాడికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రవీంద్రారెడ్డి కాలు విరిగేలా దాడి చేశారని అంబులెన్స్ వద్ద పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వివరించారు.
- తమ్మరాజుపల్లె, పాణ్యం జంక్షన్, బలపనూరు మీదుగా మధ్యాహ్నానికి నంద్యాల వద్దనున్న టోల్ గేట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వేలాది మంది వచ్చి స్వాగతం పలికారు. వాహనం నుంచి బయటికి వచ్చి ప్రతీ ఒక్కరికి అభివాదం చేసుకుంటూ వెళ్లారు.
- రుద్రవరం మండలం కోటకొండ కొత్తూరుకు చెందిన బచ్చు శివనాగిరెడ్డి, శశిరేఖ దంపతులను వైఎస్ జగన్ ఆశీర్వదించారు. టోల్‌గేట్ వద్ద వేచి ఉన్న నూతన వధూవరులను చూసి కాన్వాయ్ ఆపి పేర్లు అడిగి తెలుసుకున్నారు.
- నందిపల్లె వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో వేచి ఉండడాన్ని చూసి కాన్వాయ్ ఆపారు. ముస్లిం జంట తమ ఏడాది బిడ్డను ఆశీర్వించాలని కోరడంతో బిడ్డను ఎత్తుకుని ముద్దాడారు.



టీడీపీ నేతల హత్యాకాండ ఫొటోలను చూపిస్తున్న జగన్



జననేతను చూసేందుకు బారులు తీరి..

మూడున్నర గంటలు ఆలస్యంగా...

ఓర్వకల్లు నుంచి సీతారామాపురానికి 62 కి.మీ దూరం. కారులో అయితే గంట సేపట్లో చేరుకోవచ్చు. కానీ వైఎస్ జగన్ గ్రామానికి చేరుకోవడానికి మూడున్నర గంటలు పట్టింది. కేవలం అయ్యలూరిమెట్ట నుంచి సీతారామాపురం గ్రామానికి ఆరు కిలోమీటర్లు మాత్రమే. ఈ కొద్ది దూరం ప్రయాణించడానికి 45 నిమిషాలు పట్టింది. గ్రామానికి చేరుకుని సుబ్బరాయుడు కుటుంబ సభ్యులతో పాటు జయనారపురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భయపడొద్దంటూ భరోసానిచ్చారు. వైఎస్ జగన్‌ను చూసేందుకు మహిళలు పెద్ద ఎత్తున రోడ్లపై వేచి ఉన్నారు. చిన్నారులు, వృద్ధులు దారి పొడవునా జగన్ కోసం వేచి ఉండి ఆయన్ను చూసిన తర్వాతే వెనుదిరిగారు.

నీవే మా ధైర్యం

మహానంది: ఆరు రోజులుగా నిర్మానుష్య వాతావరణం నెలకొన్న సీతారామాపురానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో కొండంత ధైర్యం వచ్చింది. ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి టీడీపీ నేతలు సృష్టించిన అలజడి నుంచి ప్రజలు తేరుకోలేక పోయారు. రోజులు గడుస్తున్నా ఆ భయానక సంఘటన కళ్ల ముందే కనిపిస్తుండటంతో భయం నీడలో ఇళ్లల్లోనే మగ్గిపోయారు. ఓ వైపు గ్రామంలో పోలీసు పహారా.. మరో వైపు ఎవరిని పలుకరిస్తే ఏమవుతుందోనని భయాందోళనతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. కొత్త వారిని ఊరిలోకి అనుమతించ లేదు. టీడీపీ మూకల దుశ్చర్యతో గ్రామంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కొందరు కంటి మీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడిపారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో దారుణం జరగడంతో విలవిల్లాడారు. ఇలాంటి సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు ఒక్కసారిగా 'నీవై మా ధైర్యం' అంటూ అడుగులు బయటపెట్టారు. జననేతను చూసేందుకు భయాన్ని వదిలేసి 'అన్నొచ్చాడు' అంటూ పరుగులు తీశారు. అప్పటి వరకు గ్రామంలో నెలకొన్న నిశ్శబ్ద వాతావరణం మాయమైంది. గ్రామ వీధిలో నాటి హత్యా కాండ నెత్తిటి చారికలపై నడుచుకుంటూ అభిమాన నేతను చూసేందుకు కొందరు మిద్దెలెక్కగా.. మరి కొందరు సెల్‌ఫోన్లలో ఆ దృశ్యాలను బంధించారు. సుబ్బరాయుడి కుటుంబాన్ని జగన్ పరామర్శించే సమయంలో హత్యాకాండ గురించి బాధితులు ఒక్కొక్కరుగా వివరిస్తుండగా గ్రామస్తులు చలించారు. టీడీపీ మూకల అరాచకాన్ని కళ్లకుకట్టినట్లుగా చెబుతుండగా కొందరి కళ్లు చెమర్చాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులను ఓదార్చుతూ నేనున్నానంటూ భరోసా కల్పించడంతో గ్రామస్తులు భయం వీడారు. కొండంత అండ లభించడంతో 'ఎన్ని అడ్డంకులు ఎదురైనా నీవెంటే మేమంటూ జనం జై.. జగన్.. జై జగన్' అంటూ నినదించారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో అధికార పార్టీ నాడు అర్ధరాత్రి భయానక వాతావరణం సృష్టిస్తే నేడు అభిమాన నేత గాయపడిన గుండెలకు సాంత్వన చేకూర్చి సీతారామపురాన్ని తేరుకునేలా చేశారు.

పోటెత్తిన అభిమానం

- హుస్సేనాపురం వద్ద చిరు జల్లులు కురుస్తున్నా వైఎస్ జగన్ కోసం గొడుగులు పట్టుకుని ప్రజలు వేచి చూస్తూ కనిపించారు.
- తమ్మరాజుపల్లె వద్దకు ప్రజలు భారీగా వచ్చారు. దీంతో జననేత బయటకు వచ్చి ప్రజలకు అభివాదంచేశారు. అభిమానులు, కార్యకర్తలు బొకేలు, పూలమాలలు ఇవ్వగా వాటిని స్వీకరించారు. ఇక్కడ కార్యకర్తలు, అభిమానులు 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు.
- పాణ్యం డొంగు వద్ద వైఎస్ జగన్‌ను చూసేందుకు ప్రజలు భారీగా చేరుకున్నారు. వారిని నియంత్రించేందుకు పోలీసుల రోప్‌పార్టీని ఉపయోగించారు. అయినా వారిని లెక్కచేయక ప్రజలు జగన్‌తో కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు.
- బలపనూరు గ్రామం వద్ద వివిధ గ్రామాల ప్రజలతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా కనిపించారు. సమయం అవుతుందని కార్యకర్తలకు నచ్చజెప్పి వైఎస్ జగన్ ముందుకు సాగారు.



అదిగో అన్న...

- నంద్యాల ఆటో నగర్‌కు చెందిన ఆంజనేయులు అనే విద్యార్థి మూడు సంవత్సరాల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు, చేయి పనిచేయక మంచానికే పరిమితం అయ్యాడు. చిన్నతనం నుంచి వైఎస్ జగన్‌పై అభిమానం పెంచుకున్నాడు. వైఎస్ జగన్ నంద్యాలకు వస్తున్నారని తెలుసుకోవడంతో తల్లిదండ్రులు వీల్‌చైర్‌పై రోడ్డుపైకి తీసుకొచ్చారు. కాన్వాయ్ నంద్యాల టోల్‌గేట్ వద్ద ఆగాక బాలుడి పరిస్థితి గురించి నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.



అభిమాన నేత దీవెనలు

- ఎన్నికల ముగిశాక తమపై జరిగిన దాడి సంఘటనకు సంబంధించి కానాలకు చెందిన కాశీం అనే వ్యక్తి పేపర్ క్లిప్పింగ్‌ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందించేందుకు టోల్‌గేట్ వద్దకు చేరుకున్నాడు. జగన్ ప్రయాణిస్తున్న వాహనం ముందుభాగంపైకి ఎక్కాడు. వైఎస్ జగన్ వాహనాన్ని ఆపి అతని వద్ద నుంచి పేపర్ క్లిప్పింగ్‌ను తీసుకున్నారు.



అర్జీ ఇచ్చి.. కరచాలనం చేసేందుకు

- నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా టోల్‌గేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. భూమా కిశోర్ రెడ్డి, బుడ్డా శేషారెడ్డి కలిశారు.
- సీతారామాపురానికి చేరుకుని సుబ్బరాయుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం భారీ జనసందోహం మధ్య గ్రామం నుంచి వైఎస్ జగన్ వెనుదిరిగారు. సాయంత్రం 4.50 నిమిషాలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.



జ్ఞాపకాన్ని పదిల పరుస్తూ..



దారి వెంట ఉప్పొంగిన అభిమానం..



అన్నొస్తున్నాడని.. ఆనందం

రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

● అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతల పాలాభిషేకం


అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. విజయవాడ నగర నడిబొడ్డున ఉన్న సామాజిక న్యాయ మహా శిల్పం శిలా ఫలకంపై సుత్తి, ఇతర పరికరాలతో ఈ నెల 8వ తేదీన దాడి చేయడం, అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేసేందుకు దుండగులు ప్రయత్నించిన ఘటనపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలు పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం పాలతో అభిషేకించి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ ఎ. మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ, సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ .. దేశంలో ఎక్కడా లేని విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మేకులు, సుత్తెలతో దాన్ని ధ్వంసం చేయాలనుకోవడం దారుణమన్నారు. ఇలాంటి దుర్మార్గమైన పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ .. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న వారిపై దాడులకు పాల్పడటం, హత్యలు చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. దౌర్జన్యం శ్రుతి మించి అంబేడ్కర్ విగ్రహంపై దాడులు చేయడం వరకు వెళ్లిందన్నారు. శాంతిభద్రతలను అదుపులో ఉంచి, రాష్ట్ర ప్రజలను కాపాడేందుకు హోం శాఖ మంత్రి డీజీపీకి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ ... డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.404 కోట్లు వెచ్చించి అత్యంత సుందరంగా నిర్మించారన్నారు. కుట్రలో భాగంగా టీడీపీ నాయకులు విగ్రహం ఉన్న ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి, అక్కడ ఉన్న సిబ్బంది, ప్రజలను బయటకు పంపి అధికారులు, పోలీసుల ముందే దాడి చేశారన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాగ్దానాలను అమలు పరిచి ప్రజల మనసు గెలవాలే తప్ప, దాడులు చేసి భయపెట్టాలని చూడడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవమానకరం



రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శిలాఫలాకాలు ధ్వంసం చేయడం అవమానకరం. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫకాలు వేసుకోవడం ఆనవాయితీ. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గత ప్రభుత్వం అనుసరించిన విధివిధానాలను గౌరవించడం సంస్కారం. అలా కాకుండా ధ్వంసం చేసుకుంటూ పోతే చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు భవిష్యత్తు తరాలకు తెలియకుండాపోతాయి.

– పులికొండ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

అనాగరిక చర్య



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిమ్నజాతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారు. రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం హర్షణీయం. ప్రస్తుత టీడీపీ పాలనలో దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలనుకోవడం అనాగరిక చర్య.

– లక్ష్మణ్‌రావు, దళిత సంఘం నేత, ఆదోని

ఎలుగుబంటి హల్‌చల్


ఆలయం వద్ద ఎలుగుబంటి సంచారం

శ్రీశైలం: శ్రీశైలం – దోర్నాల ఘాట్‌లో క్షేత్రానికి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద పెద్ద ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. గురువారం సాయంత్రం జరిగిన ఘటనను వీడియో తీసిన వాహనదారులు సోషల్ మీడియాలో పెట్టడంతో అది వైరల్‌గా మారింది. ప్రకాశం జిల్లా పరిధిలోని ఈ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని శ్రీశైలం మండలంలోని ఆంజనేయ స్వామి భక్తులు తమ సొంత ఖర్చులతో అభివృద్ధి చేశారు. శ్రీశైలం వచ్చి వెళ్లే వాహనదారులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని వెళ్తారు. ఈ క్రమంలో కొందరు భక్తులు స్వామి దర్శించుకునేందుకు వెళ్లగా అక్కడ ఎలుగుబంటిని చూసి భయాందోళన చెందారు. వెంటనే తేరుకుని ఆలయంలోకి వెళ్లి గ్రిల్ గేట్లు మూసివేసి ప్రాణాలు రక్షించుకున్నారు. కొద్ది సేపటి తర్వాత ఎలుగుబంటి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వాహనదారులు బయటకు వచ్చి వాహనంలో వెళ్లిపోయారు.

క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు (టౌన్): ఈనెల 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. భూపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి మార్చి 2024 వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో ఈనెల 14వ తేదీ కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వివరాలకు ఆఫీసు పని వేళల్లో 08518–225419 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హక్కులను కాల రాయడమే!

రాజ్యాంగం ముస్లింలకు కల్పించిన హక్కులను కాల రాయడానికే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందని పలువురు ఆరోపించారు. 1995 వక్ఫ్ యాక్ట్ ప్రకారం సంబంధిత ఆస్తులపై సర్వాధికారం కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డులకు మాత్రమే కల్పించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. ఈ బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం సబబు కాదన్నారు. అభిప్రాయాలు వారిమాటల్లోనే..

బీజేపీ కుట్ర



పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వడం దారుణం. చట్టం పేరుతో భూములను ఇష్టానుసారంగా వినియోగించుకోవాలని బీజేపీ కుట్ర పన్నుతోంది. చట్టాన్ని అడ్డు పెట్టుకుని మసీద్, దర్గా, వక్ఫ్ భూములను, ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కేంద్రం భావించడం సమంజసం కాదు. బిల్లుకు తెలుగుదేశం ప్రభుత్వం మద్దతు తెలపడాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి.

– ఫారుక్, ముస్లిం సంఘం నాయకుడు, సి.బెళగల్

పెత్తనాన్ని సహించం

వక్ఫ్ ఆస్తి ముస్లింలలోని పేదల సంక్షేమం కోసం ఉద్దేశించింది. వక్ఫ్‌బోర్డుల్లో ముస్లిమేతరుల పెత్తనాన్ని సహించం. పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ ఎంపీలు మద్దతివ్వడం బాధాకరం. ముస్లింల హక్కులను కాపాడాలి.



– నబీరసూల్, రిటైర్డు ఉద్యోగి, ఆలూరు

టీడీపీ మద్దతు ఇవ్వడం శోచనీయం



వక్ఫ్‌బోర్డు నిబంధనల్లో సవరణలు చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే. పార్లమెంట్‌లో చట్ట సవరణకు టీడీపీ మద్దతు పలకడం అవివేకం. ఈ సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు వ్యతిరేకించడం హర్షించదగ్గ విషయం. వక్ఫ్ బోర్డ్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ కుట్రలు పన్నుతోంది.

– రియాజ్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

● విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలి
● జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా


విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (అర్బన్): చదువుతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. కష్టపడి చదివి విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. బి.క్యాంప్‌లోని బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆకస్మిక తనిఖీ చేశారు. క్లాస్‌రూమ్‌లో 10, 9వ తరగతి విద్యార్థులు ఎంతమంది ఉన్నారనే వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ..' మీరు జీవితంలో ఏం అవ్వాలనుకుంటున్నారు? మీ ఆశయాలు ఏంటి?' అని తెలుసుకున్నారు. చాలా మంది విద్యార్థులు కలెక్టర్, ఎస్పీ, డాక్టర్, లాయర్ స్థానాల్లో ఉండాలనుకుంటున్నామని తెలపగా.. కలెక్టర్ స్పందిస్తూ పట్టుదలతో చదివి కలలను సాకారం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి ఒక ఆశయం ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఒక్కొక్క విద్యార్థిలో ఇంటలిజెన్స్ (ఐక్యూ) అనేది ఒక్కొక్క లాగా ఉంటుందని, ప్రతి విద్యార్థికి కష్టపడే తత్వం మాత్రం కచ్చితంగా ఉండాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఎన్ని మార్కులు వచ్చాయనేది ముఖ్యం కాదని, జీవితంలో ఎన్నో అవకాశాలు ఉంటాయని, ఈ విషయాన్ని ప్రతి ఒక్క విద్యార్థి గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంత్ సేవాలాల్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డీఓ శేషిరెడ్డి, ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ అధికారి రంగలక్ష్మీదేవి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకులకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పకుమార్ తెలిపారు. చదవడం, రాయడం వచ్చి 18 నుంచి 45 ఏళ్లలోపు యువకులు అర్హులని, వివరాలకు 9000710508ను సంప్రదించాలన్నారు.

వర్షం కోసం.. ఊరంతా కదిలి


కాడెద్దులతో వెళ్లిన గ్రామస్తులు

● 101 కాడెద్దులతో వెళ్లిన కలుగొట్ల వాసులు
● నాగదేవతకు నైవేద్యం


నాగదేవత

వెల్దుర్తి: వర్షం కోసం శుక్రవారం కలుగొట్ల గ్రామస్తులంతా కదిలారు. నాగదేవతకు నైవేద్యం సమర్పించారు. ముందుగా 101 కాడెద్దులను సుందరంగా అలంకరించారు. వాటిని తీసుకుని కుటుంబ సమేతంగా గ్రామంలోని నూతినాగమ్మ గుడి వద్ద చేరుకున్నారు. అక్కడి నుంచి కాడెద్దులతో పాటు బోనాలు నెత్తిన పెట్టుకుని నాగమ్మకుంట వద్దకు వెళ్లి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాన్ని సమర్పించి, అన్న సంతర్పణ చేశారు. తిరిగి అందరూ 101 కాడెద్దులతో నూతి నాగమ్మగుడి వద్ద వచ్చి బోనాలు ఉంచి పూజలు చేశారు. వర్షం రప్పించేలా నాగదేవత పరమశివున్ని మెప్పిస్తుందనే ఆశతో ప్రత్యేక పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.38లక్షలు


కానుకల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి హుండీల్లోని కానుకలను శుక్రవారం కాలక్షేపపు మండపంలో లెక్కించారు. నగదు రూపంలో రూ. 38,70,013 , వెండి 6.6 కిలోలు వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఉత్సవాల చీఫ్ ఆఫీసర్ పాండురంగారెడ్డి తెలిపారు. శ్రావణమాసం ప్రారంభం అయిన తర్వాత మొదటి సారిగా శుక్రవారం హుండీల్లో కానుకలను లెక్కించినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉపప్రధాన అర్చకుడు మహాదేవస్వామి, ఆలయ పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వెదురు బొంగుల పట్టివేత


స్వాధీనం చేసుకున్న వాహనంతోపాటు అటవీ శాఖ అధికారులు

కర్నూలు(సెంట్రల్): అనుమతులు లేకుండా బొలెరో పికప్ వాహనంలో తీసుకొస్తున్న 460 వెదురు బొంగులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్ఓ ఎం.సూర్యచంద్రరాజు తెలిపారు. కర్నూలు శివారులో శుక్రవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించి వాహనంతో సహా వీటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. డ్రైవర్ చిన్నబాబును అదుపులోకి తీసుకున్నామన్నారు. వెదురు బొంగుల విలువ రూ.80,000 ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ వాచర్లు ఎ. మధు, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం ఎన్నికలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం (అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్) ఎన్నికలు ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పివి సాయికుమార్ తెలిపా రు. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అధ్యక్షు డు వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా కృష్ణ జిల్లా అధ్యక్షుడు వెన్నా రమేష్, పరిశీలకుడిగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డీ ఎస్ఎన్ శ్రీనివాస్‌లను నియమించినట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేసే వ్యవసాయ ఉద్యోగులు, 4వ తరగతి ఉద్యోగులు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించే సామర్థ్యం ఉన్న వారిని ఎన్నుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో నిర్వహిస్తామన్నారు.

'ఎంపీడీఓలను రిలీవ్ చేస్తున్నాం'

కర్నూలు(అర్బన్): ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు వచ్చిన ఎంపీడీఓలు వారి సొంత మండలాలకు వెళ్లేందుకు వీలుగా రిలీవ్ చేస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అనంతపురం జిల్లా నుంచి 23 మంది, వైఎస్సార్ జిల్లా నుంచి 16 మంది (మొత్తం 39 మంది) ఎంపీడీఓలు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇప్పటి వరకు విధులు నిర్వహించారన్నారు. వీరిని ఆయా జిల్లాల్లోని సొంత మండలాలకు పంపేందుకు వీలుగా పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వులను అనుసరించి రిలీవ్ చేస్తున్నామన్నారు. జిల్లా లోని వివిధ మండలాల నుంచి రిలీవ్ అవుతున్న ఎంపీడీఓలు సంబంధిత కార్యాల య పరిపాలనాధికారి లేక ఈఓఆర్‌డీలకు బాధ్యతలు అప్పగించి రిపోర్టును తమకు పంపాలన్నారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

● వివాహేతర సంబంధమే కారణమని తేల్చిన పోలీసులు


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న కర్నూలు డీఎస్పీ

కర్నూలు: నగరంలోని పాతబస్తీ వర్మ కాంపౌండ్‌లో కురువ శివుడు (36) దారుణ హత్య కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు తేల్చారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన నలుగురు నిందితులను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. సీఐ పవన్ కుమార్‌తో కలసి శుక్రవారం సాయంత్రం డీఎస్పీ బాబు ప్రసాద్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. కర్నూలు కార్పొరేషన్‌లో ఉద్యోగం నిర్వహించి పదవీ విరమణ పొందిన దామోదర్ కుమారుడు కురువ శివుడు ఆరేళ్లుగా స్వగ్రామం ఇ.తాండ్రపాడును వదిలి కుటుంబ సభ్యులకు దూరంగా కర్నూలు పాతబస్తీలోని వర్మ కాంపౌండ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన యువతితో వివాహం కాగా మూడేళ్ల క్రితమే విడిపోయారు. క్రికెట్ బెట్టింగ్, జూదం వంటి వాటికి బానిసై అప్పుల పాలయ్యాడు. ఊరు వదిలి వర్మ కాంపౌండ్‌లోనే గుడిసె వేసుకుని ఒంటరిగా ఉండేవాడు. సమీప కాలనీకి చెందిన షేక్ రఫీక్..తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు గుర్తించి స్నేహితులైన తెలుగు బ్రహ్మం, తొట్టంపురి భరత్, పింజరి ముర్తుజావలిలతో కలసి ఈనెల 6న రాత్రి 11.30 గంటల సమయంలో వర్మ కాంపౌండ్‌కు చేరుకున్నారు. క్రికెట్ బ్యాట్‌లతో కురువ శివుడు తల, ముఖంపై కొట్టి దారుణంగా హత్య చేశారు. మృతుని సోదరుడు కురువ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పక్కా ఆధారాలతో జొహరాపురం శివారులో నిందితులు ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. రెండు రోజుల వ్యవధిలోనే హత్య కేసులోని నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.

పెన్షన్ స్కీమ్ మెడికల్ సర్టిఫికెట్లు జారీ


మెడికల్ సర్టిఫికెట్ అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ మెడికల్ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకరరెడ్డి జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ స్కీమ్ మెడికల్ సర్టిఫికెట్ల కోసం 117 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో అర్హులైన ఆరుగురు పక్షవాత బాధితులకు మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. ఈ సర్టిఫికెట్ల జారీకి ఆసుపత్రిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బుధవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు మెడికల్ బోర్డు అందుబాటులో ఉంటుందన్నారు. సర్టిఫికెట్లు అవసరమైన వారు ముందుగానే వచ్చి తమ ఫోన్ నెంబర్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, సదరమ్ సర్టిఫికెట్‌తో దరఖాస్తును సమర్పించాలన్నారు. ఇలా ఇచ్చిన దరఖాస్తుల్లో సీనియారిటి ప్రకారం పలు దఫాలుగా పిలిచి అందులో అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. బుధవారం, సెలవు రోజుల్లో తప్ప మిగితా అన్ని రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.